

ఇంటి వద్దకే రేషన్ సరుకులు

● మంత్రి చక్రపాణి



పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరకులు ఇళ్లకే వెళ్లి అందించే కార్యక్రమం త్వరలో అమలులోకి రానుందని ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో అన్నాడీఎంకే ఎమ్మెల్యే సెంగోట్టయ్యన్... కర్ణాటక రాష్ట్రంలో రేషన్ కార్డుదారుల ఇళ్లకే సరుకులు అందించే పథకం అమలులో ఉందని, రాష్ట్రంలో కూడా ఈ పథకం ప్రవేపెట్టే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? అంటూ ప్రశ్నించారు. దానికి మంత్రి చక్రపాణి సమాధానిమిస్తూ... కర్ణాటక రాష్ట్రంలోనే కాకుండా ఆంధ్రాలో కూడా సరుకులు ఇళ్లకే వెళ్లి ఇస్తున్నారన్నారు. ఈ నెల 20వ తేది తమ శాఖ అధికారులు ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వెళ్లి ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ సరకులు సరఫరా విధానాలు పరిశీలించనున్నారని తెలిపారు. అధికారుల నివేదిక ఆధారంగా ఈ పథకంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. కాగా, పుదుచ్చేరిలో రేషన్ కార్డుదారుల ఇళ్లకే వెళ్లి రేషన్ సరుకులు అందజేయనున్నట్లు ఆ రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రంగస్వామి బుధవారం ప్రకటించడం గమనార్హం.

వచ్చే వేసవి వరకు చెన్నైలో నీటి సరఫరాకు కొరతలేదు
● అసెంబ్లీలో మంత్రి కేఎన్ నెహ్రూ 6

ప్రతి గురువారం ప్రత్యేక విచారణ

పెండింగ్ కేసులకు పరిష్కారం ● హైకోర్టు చర్యలు



టి.నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టులో 20 యేళ్ళకు పైగా పెండింగ్‌లో ఉన్న పాత కేసులను పరిష్కరించడానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు ప్రతి గురువారం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై విచారణ జరపాలని ఆయన ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. మేజిస్ట్రేట్ కోర్టు నుండి సుప్రీం కోర్టు వరకు యేళ్ల తరబడి వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించడానికి హైకోర్టు తరఫున లోక్ అదాలత్‌లు కూడా నిర్వహించి పాత కేసులను పరిష్కరిస్తున్నారు. అయినా ప్రతీ ఏటా కొత్త కేసులు తోడవుతుండగా, పెండింగ్ కేసులు ఏ మాత్రం తగ్గటం లేదు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్ పెండింగ్ కేసుల విచారణ ప్రతి గురువారం తప్పకుండా జరపాలని ఆదేశాలిచ్చారు. ఆ ప్రకారం జ్యుడిషియల్ రిజిస్ట్రార్ కే సీతారామన్ ఓ సర్క్యులర్ కూడా విడుదల చేశారు. 20 యేళ్ళకు పైగా పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల కేసులను ఎంపిక చేసిన న్యాయమూర్తులు విచారణ జరుపుతారన్నారు. ఈ పాత పెండింగ్ కేసుల విచారణ గురువారం నుండి మద్రాస్ హైకోర్టు, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో ప్రారంభమవుతాయన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



వట్టివేర్ల మాలలు, పుష్పమాలలు ధరించి దర్శనమిస్తున్న దైవానై సమేత మురుగప్పెరుమాన్

నేత్రపర్వంగా తిరుప్పరంకుండ్రం రథోత్సవం

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మురుగప్పెరుమాన్ ఆరు దివ్యక్షేత్రాల్లో మొదటిదైన తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పంగుణి ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన మహారథోత్సవం బుధవారం ఉదయం నేత్ర పర్వంగా జరిగింది. 15 రోజులపాటు నిర్వహించే పంగుణి ఉత్సవాలు ఈ నెల 5న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ప్రతిరోజూ మురుగప్పెరుమాన్ దైవానై అమ్మవారి సహా పల్లకీలు, స్వర్ణ మయూర, అశ్వ, హంస, శేషవాహనం తదితర వాహనాలలో ఆలయ ప్రధాన వీధుల్లో విహరించారు. ఈ వేడుకల్లో భాగంగా ఈ నెల 16 సాయంత్రం ఆలయం ఎదుట శూర సంహార ఘట్టాన్ని కూడా అత్యద్భుతంగా ప్రదర్శించారు. సోమవారం రాత్రి మురుగప్పెరుమాన్‌కు పట్టాభిషేకమహోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి ఆలయంలో జరిగిన మురుగప్పెరుమాన్, దైవానై తిరుకల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహవేడుకలకు మదురై నుంచి మీనాక్షి దేవి, సుందరేశ్వరులు వచ్చి నూతన వధూవరులను ఆశీస్సులందించారు. మురుగప్పెరుమాన్ వివాహం సందర్భంగా వివాహితులందరూ తమ మెడలో కొత్త పసుపుతాళ్ళను ధరించారు. ఆ తరువాత మీనాక్షి సుందరేశ్వరులకు నూతన వధూవరులైన మురుగప్పెరుమాన్, దైవానై ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన రథోత్సవం బుధవారం ఉదయం ప్రారంభమైంది. ఆ సందర్భంగా ఆలయంలో వేకువజాము 4 గంటలకు ఉత్సవర్ల సన్నిధిలో మురుగన్, దైవానై అమ్మవారికి 16 రకాల సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆ తర్వాత వట్టివేర్ల మాలలు వేసి స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఊరేగిస్తూ తీసుకువెళ్లి రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఉంచారు. అప్పటికే రథమండప ప్రాంతంలో చేరిన భక్తులంతా రథం మోకుతాళ్లను లాగుతూ 'హరోం... హరా... మురుగయ్యా' అంటూ నినాదాలు చేశారు. మహారథానికి ముందు చిన్న రథంలో బొజ్జగణపయ్య వెళ్ళారు. ఆ రథం వెనుకనే మహారథాన్ని గిరి ప్రదక్షిణ మార్గంలో ఊరేగించారు. ఈ వేడుకల్లో తిరుప్పరంకుండ్రం, అవనియాపురం, నిలయూరు, కూత్తియార్‌కుండు, తనకన్నన్‌కుళం తదితర గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ఉదయం 6.40 గంటలకు బయలుదేరిన రథం మధ్యాహ్నం 12.45 గంటలకు రథమండప ప్రాంతానికి తిరిగి చేరింది. రథాన్ని ఊరేగించిన మార్గాల్లో రహదారికి ఇరువైపు స్థానిక భక్తజన సంఘాలు భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. పలుచోట్ల భక్తులు అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ వేడుకలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షులు సత్యప్రియా బాలాజీ, సభ్యులు షణ్ముగసుందరం, మణి సెల్వ, బొమ్మదేవన్, రామయ్య, ఆలయ డిప్యూటీ కమిషనర్ సూర్యనారాయణన్ తదితర అధికారులు తగు ఏర్పాట్లు కల్పించారు.

రిటైర్డ్ ఎస్ఐ హత్యపై అసెంబ్లీలో వాగ్యుద్ధం

● తిరునల్వేలిలో హత్యకు పోలీసుల వైఫల్యమే కారణం
● ఈపీఎస్ ధ్వజం
● కఠిన చర్యలు చేపడుతున్నాం : సీఎం స్టాలిన్



సావధానతీర్మానంపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి భద్రతా విభాగంలో పనిచేసిన రిటైర్డ్ ఎస్ఐ జాకీర్‌హుస్సేన్ హత్యపై ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), ముఖ్యమంత్రి స్టాలిన్ మధ్య బుధవారం అసెంబ్లీలో తీవ్ర వాగ్వివాదం జరిగింది. తన ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని మూడు నెలల క్రితమే జాకీర్ హుస్సేన్ వీడియో పోస్టు చేశారని, అప్పుడే పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే ఈ హత్య జరిగేది కాదని ఈపీఎస్ పేర్కొన్నారు. ఆ వీడియో విడుదలైనప్పటి నుంచే పోలీసులు అప్రమత్తంగానే వ్యవహరించారని, ఆ వీడియో జాకీర్‌హుస్సేన్ చేసిన ఆరోపణలపై విచారణ కూడా ప్రారంభించారని ముఖ్యమంత్రి స్టాలిన్ బదులిచ్చారు. తొలుత ఈపీఎస్ అసెంబ్లీలో సావధాన తీర్మానం ప్రవేశపెట్టి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో రిటైర్డ్ ఎస్ఐ ప్రాణాలకే భద్రతలేదని, పోలీసుశాఖ నిర్వీర్యంగా మారిందని ఆరోపించారు. తన ప్రాణలకు ముప్పువాటిల్లుతుందని మూడు నెలల క్రితమే జాకీర్ హుస్సేన్ తెలిపినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విరుచుకుపడ్డారు. సావధానతీర్మానం ప్రవేశపెట్టిన ఈపీఎస్ మాత్రమే కాకుండా మరికొంత మంది సభ్యులు కూడా రిటైర్డ్ ఎస్ఐ హత్యను ఖండిస్తూ మాట్లాడటానికి సభలో అనుమతించడాన్ని బట్టి డీఎంకే ప్రభుత్వం అరమరికలు లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నడిచి వెళుతున్న జాకీర్ హుస్సేన్‌ను గుర్తు తెలియని వ్యక్తుల హత్య చేశారని చెప్పారు. అతని భార్య ఫిర్యాదు మేరకు తిరునల్వేలి సిటీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారని, ఈ హత్య కేసుకు సంబంధించి ఇప్పటికే తిరునల్వేలి తొట్టిపాల వీధికి చెందిన ఇద్దరు కోర్టులో లొంగిపోయారని చెప్పారు. తక్కిన హంతకుల కోసం ప్రత్యేక పోలీసు దళాలు గాలిస్తున్నాయన్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో జాకీర్‌హుస్సేన్‌కు, అదే ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి అలియాస్ మహమ్మద్ తౌఫీక్‌కు మధ్య భూ తగాదాలున్నట్లు కనుగొన్నారని తెలిపారు. ఈ కేసును ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, హంతకులు ఎలాంటివారైనా సరే వారికి కఠిన శిక్షలు తప్పవని స్టాలిన్ హెచ్చరించారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (గురువారం సాయంత్రం)
సహర్: 4:33 (శుక్రవారం ఉదయం)



ఎగ్మూరు మ్యూజియం వద్ద రూ.50లక్షలతో ఏర్పాటు చేసిన బ్రిటీష్ ఇండియా పురావస్తు శాఖ ప్రధాన సంచాలకులు సర్ జాన్ హూబర్డ్ మార్షల్ విగ్రహాన్ని మంత్రులతో కలిసి ఆవిష్కరించిన ముఖ్యమంత్రి స్టాలిన్

● అవినీతి ఆరోపణల నేపథ్యం..

పాఠ్యపుస్తకాల మండల అధికారి డిస్మిస్

మరో ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తమిళనాడు పాఠ్యపుస్తకాల సొసైటీ మదురై మండల అధికారి డిస్మిస్ కాగా, మరో ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని తమిళనాడు పాఠ్యపుస్తకాల సొసైటీకి రాష్ట్రవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో గోడౌన్‌లున్నాయి. ఒక్కో గోడౌన్‌లో మండల అధికారి, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, విద్యార్థులకు ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలు ప్రైవేటు పాఠశాలలకు విక్రయిస్తూ పలు మండలాల్లో లక్షల్లో అవినీతి జరిగిందని పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదులందాయి. ముఖ్యంగా, మదురై మండలంలో పనిచేసే మహిళా అధికారి ఇదివరకే పనిచేసిన ప్రాంతంలో రూ.75 లక్షల మేర అవినీతికి పాల్పడ్డారని విచారణలో తెలియడంతో, ఆమెను డిస్మిస్ చేస్తూ సొసైటీ చర్యలు చేపట్టింది. అలాగే తరమణిలో కూడా సొసైటీ గోడౌన్‌లో పనిచేస్తున్న మండల అధికారి, తిరువళ్లూర్, దిండుగల్ మండల అధికారులు కూడా లక్షల్లో అవినీతికి పాల్పడ్డారని తెలియడంతో ముగ్గురిని సస్పెండ్ చేశారు.

వాననీటి కాల్వలు, రహదారులకే ప్రాధాన్యం

రూ.5145 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించే వార్డుల అభివృద్ధి పథకానికి రూ.100 కోట్లు, మేయర్ స్వీయపర్యవేక్షణలో చేపట్టనున్న ప్రత్యేక అభివృద్ధి పథకానికి రూ.3కోట్ల మేరకు నిధులు కేటాయిస్తున్నట్టు జీసీసీ మేయర్ ప్రియ వెల్లడించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ సమావేశంలో బుధవారం 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక బడ్జెట్‌ను మేయర్ ప్రవేశపెట్టారు. తొలిసారిగా రూ.5,145.52 కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్ ప్రతిపాదనలను ఆమె సభకు నివేదించారు. రూ.68 కోట్ల లోటుతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ద్వారా నగరంలో అమలు చేయనున్న పథకాల వివరాలను ఆమె వెల్లడించారు. సింగార చెన్నై 2.0 పథకం అమలులో భాగంగా రహదారుల అభివృద్ధికి రూ.628.35 కోట్లు, వాననీటి కాల్వల నిర్మాణానికి రూ.1032.25 కోట్లు, స్వచ్ఛభారత్ అమలు కోసం పరికరాల కొనుగోలు, వ్యర్థాల తొలగింపు, నిర్వహణకు రూ.352 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నగరంలో వంతెనల నిర్మాణంతోపాటు పాతబడిన వంతెనల పునర్నిర్మాణం, మరమ్మతులకు రూ.164.03 కోట్లు కేటాయించనున్నామన్నారు. నగరంలో సింగార చెన్నై 2.0 పథకం, ఉత్తర చెన్నై అభివృద్ధి పథకాలకు రూ. 413.63 కోట్లు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి రూ.9 కోట్లు, మూలధన పెట్టుబడి ద్వారా నగరంలో వీధి దీపాల స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల తదితర విద్యుత్ సంబంధిత పనులకు రూ.50.40 కోట్ల మేరకు నిధులు ఖర్చు చేయనున్నట్లు ఆమె వివరించారు. పారిశుధ్య పనులకు అవసరమైన వాహనాలు, ఉపకరణాల కొనుగోలు, సముద్రతీరాన్ని శుభ్రపరిచే యంత్రం, తదితర యంత్రాలను కొనుగోలు చేయడానికి రూ.22 కోట్లు కేటాయిస్తామని, విద్యా శాఖకు రూ.5 కోట్ల మేరకు నిధులు కేటాయించి పాఠశాలలకు అవసరమైన ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేయడం, తగు సదుపాయాలు కల్పిస్తామని మేయర్ ప్రియా తెలిపారు.



బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వెళుకతన్న మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమార గురుబరన్

ప్రత్యేక పథకాలకు రూ.179.03 కోట్లు...

నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, నిర్భయ పథకం, సింగార చెన్నై 2.0 పథకం, నగరాభివృద్ధి తదితర ప్రత్యేక పథకాల అమలుకు రూ.179.03కోట్ల మేరకు నిధులు కేటాయిస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. నగరంలో కార్పొరేషన్ స్థలాల్లో ఉద్యానవనాల ఏర్పాటు, పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు , వ్యాయామశాలలు తదితర పథకాలకు రూ.39.30 కోట్లు కేటాయిస్తామన్నారు. ఈ బడ్జెట్ నిధుల చేపట్టనున్న పథకాలను ఆమె క్లుప్తంగా వివరించారు.

- టీఆర్ గార్డెన్, సెంబియం, తురైపాక్కం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రూ.90లక్షలతో వృద్ధుల చికిత్సకు ప్రత్యేక వార్డుల ఏర్పాటు. ● నగరవాసులు వృత్తిపన్ను, ఆస్తిపన్ను సులువుగా చెల్లించడానికి క్యూఆర్ కోడ్ విధానం అమలు.
- నగరంలో 200 బస్టాపుల వద్ద రూ.30 కోట్లతో షెల్టర్లు.
- ఉత్తరచెన్నైలో ఆండార్‌కుప్పం- ఏలందూరు, కడయంకుప్పం- బర్మానగర్ ప్రాంతాల్లో రూ.2.50 కోట్లతో బ్యాడ్మింటన్ కోర్టులు.
- వార్డు అభివృద్ధి నిధులను రూ.50లక్షల నుండి రూ.60 లక్షలకు పెంపు.

ఈరోడ్‌లో సేలం రౌడీ హత్య

● కాల్పులు జరిపి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినపోలీసులు
● ఎస్ఐ, కానిస్టేబుల్‌కు గాయాలు

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఈరోడ్‌లో బుధవారం మధ్యాహ్నం కారులో వెళుతున్న సేలం నగరానికి చెందిన జాన్ అనే పేరుమోసిన రౌడీ దారుణహత్యకు గురయ్యారు. కారులో వచ్చిన ఐదుగురు వ్యక్తులు వేటకొడవళ్లతో దాడిచేసి హతమార్చి పారిపోయారు. హంతకులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన జాన్ భార్య శరణ్యకు తీవ్ర గాయాలయ్యాయి. జాన్‌పై పలు పోలీసుస్టేషన్లలో హత్య, హత్యాయత్నం, దారిదోపిడీ కేసులున్నాయి. ఈ నేపథ్యంలో తిరుప్పూరులో ఉంటున్న జాన్ ఓ కేసులో బెయిల్ నిబంధనల మేరకు అన్నదానపట్టి పోలీసుస్టేషన్‌లో సంతకం చేసి భార్యతో కలిసి కారులో బయలుదేరారు. అదే సమయలో జాన్ కారును వెంబడిస్తూ ఐదుగురు వ్యక్తులు మరో కారు లో వచ్చి ఢీకొట్టారు. దీంతో కారులో నుండి దిగిన జాన్‌ను ఆ ఐదుగురు చుట్టుముట్టి వేటకొడవళ్లతో దాడిచేసి హతమార్చారు. ఈ దాడి జరుగుతుండగా ఆ రహదారిలో వందల సంఖ్యలో వాహనచోధకులు వెళుతున్నా పట్టించుకోలేదు. దీనితో దుండుగులు నింపాదిగా కారెక్కి పరారయ్యారు. ఈ సంఘటన గురించి తెలియగానే ఈరోడ్ అంతటా పోలీసులు నిఘా తీవ్రతరం చేశారు. హత్య జరిగిన ప్రాంతంలో సీసీ ఫుటేజీ ఆధారంగా హంతకులు ప్రయాణించిన కారు నెంబర్ గురించి గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఈరోడ్ శివారులో వెళ్తున్న కారును పోలీసులు వాహనాల్ల వెంబడించి ఆపేందుకు ప్రయత్నించారు. పోలీసులను చూడగానే దుండగులు కారు దిగి వారిపై దాడి చేస్తూ, పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు తుపాకీతో కాల్పులు జరిపి భూపాలన్, సతీష్, శరవణన్ అనే ముగ్గురిని అరెస్టు చేశారు. మరో దుండగుడు కార్తికేయన్‌ను అరెస్టు చేశారు. మరో వ్యక్తి అక్కడి నుండి పారిపోయాడు. దుండగుల దాడిలో చిత్తేడు పోలీసుస్టేషన్ ఎస్ఐ రవి, కానిస్టేబుల్ యోగరాజ్ గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స కోసం కోయంబత్తూరు ఆసుపత్రికి తరలించారు.



దుండుగల దాడి ధ్వంసమై రౌడీ జాన్ కారు

సమాచార దర్శిని

23న 'పానుగంటి వారి విశ్వరూపం-సాక్షి' ఉపన్యాసం

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'వేదవిజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 159వ ప్రసంగ కార్యక్రమం ఈ నెల 23న జరుగనుంది. టి.నగర్ విజయరాఘవరోడ్డులోని ఆంధ్రా క్లబ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు రాజమండ్రికి చెందిన విశ్రాంతాచార్యులు డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు 'పానుగంటి వారి విశ్వరూపం-సాక్షి' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో 29న ఉగాది వేడుకలు

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ తెలుగు సమాఖ్య' ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉగాది వేడుకలు జరుగనున్నాయి. అడయార్ ఆదితనార్ రోడ్డులో వున్న గాంధీనగర్ లేడీస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు జరుగనున్న ఈ వేడుకలో భాగంగా చెన్నై మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి టి.రుక్మిణీదేవికి ఉగాది పురస్కారం బహూకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఫణీంద్రశర్మ పంచాంగశ్రవణం చేయనుండగా, ప్రముఖ చిత్రదర్శకుడు సీఎస్ రావు శతజయంతి సందర్భంగా దృశ్యరూపకం ప్రదర్శించనున్నారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

తిరుపతి వెళ్లే రైళ్లకు ఎల్‌హెచ్‌బీ బోగీలు

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రెండు నగరాల నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.22616/22615 కోయంబత్తూరు-తిరుపతి-కోయంబత్తూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 20వ తేది నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలతో నడుపనున్నారు. అలాగే, నెం.22617 తిరుపతి- బెంగళూరు (వయా.కాట్పాడి, జోలార్‌పేట) సూపర్ ఫాస్ట్ రైలు ఈ నెల 21వ తేది, నెం.22618 బెంగళూరు-తిరుపతి సూపర్ ఫాస్ట్ రైళ్లు ఈ నెల 22వ తేది నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలతో నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

పుస్తక ప్రదర్శనలో రూ.52 లక్షల విక్రయాలు

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో నిర్వహించిన 4వ వార్షిక పుస్తక ప్రదర్శనలో రూ.52 లక్షల విలువైన పుస్తకాలు విక్రయమయ్యాయి. ఈనెల7వ తేది ప్రారంభమైన పుస్తక ప్రదర్శన మంగళవారంతో ముగిసింది. ప్రదర్శనలో 115స్టాల్స్ ఏర్పాటు చేయగా సాహిత్యం,కథలు, నవలలు, చరిత్ర, ఫాంటసీ సహా పలు రకాల పుస్తకాలున్నాయి. ఈ ప్రదర్శనకు విద్యార్థులు, ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, ఈ ప్రదర్శనలో రూ.52 లక్షల విలువైన పుస్తకాలు విక్రయమయ్యాయని కలెక్టర్ ప్రతాప్ తెలిపారు.

గంటలోపే ముగిసిన ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టిక్కెట్ల విక్రయాలు ప్రారంభమైన గంటలోపే హాట్ కేక్‌లా అయిపోయాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18 వ సీజన్ ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది. 23వ తేది చేపాక్కం మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్-ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ టిక్కెట్లు ధర రూ.1,700-రూ.7,500లుగా నిర్ణయించి, బుధవారం ఉదయం 10.15 గంటలకు ఆన్‌లైన్‌లో విక్రయాలు ప్రారంభించారు. విక్రయాలు ప్రారంభమైన గంటలోపే అన్ని టిక్కెట్లు విక్రయమైనట్లు నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రానికి 260 మెగావాట్ల విద్యుత్

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి సీజన్ ప్రారంభం కావడంతో రోజువారి విద్యుత్ వినియోగం 16వేల మెగావాట్ల నుంచి 18వేల మెగావాట్లకు పెరిగింది. రాబోయే ఏప్రిల్, మే నెలల్లో వినియోగం 22వేల మెగావాట్లకు పెరిగే అవకాశముందని విద్యుత్ బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. అందువల్ల పెరుగుతున్న వినియోగానికి అనుగుణంగా అదనంగా విద్యుత్ కొనుగోలు చేయడం, కేంద్ర ప్రభుత్వం నుంచి పొందాలని ఈబీ నిర్ణయించింది.ఈనేపథ్యంలో, కర్ణాటక రాష్ట్రంలోని జాతీయ థర్మల్ కేంద్రం ఎన్టీపీసీ నుంచి రాష్ట్రానికి ఈ నెల 13 నుంచి మే 31వ తేది వరకు 260 మెగావాట్ల విద్యుత్ కేటాయిస్తూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

21 నుంచి మూడు మండలాల్లో తాగునీటి సరఫరా నిలిపివేత

● మెట్రో వాటర్ బోర్డు

వాషర్‌మెన్‌పేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని మూడు మండలాల్లో ఈ నెల 21 నుంచి 26వ తేది వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మెట్రోవాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... నెమ్మేలిలోని నిర్లవణీకరణ కేంద్రంలో నిర్వహణ పనుల కారణంగా అడయార్, పెరుంగుడి, షోలింగనల్లూర్ మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆ ప్రకారం, 13వ మండలం (అడయార్) తిరువాన్మియూర్, 4వ మండలం (పెరుంగుడి) కొట్టివాక్కం ప్రాంతాల్లో ఈ నెల 21,23,25 తేదీలు, 15వ మండలం (షోలింగనల్లూర్) ఈంజంబాక్కం, నీలాంగరై, వెట్టువాంకేణి, ఉద్దాండి, 14వ మండలం (పెరుంగుడి) పెరుంగుడి, పాలవాక్కం, కారపాక్కం, 15వ మండలం (షోలింగనల్లూర్) షోలింగనల్లూర్, ఓక్కియం, దురైపాక్కం ప్రాంతాల్లో ఈ నెల 22,24,26 తేదీల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. ఈ కారణంగా ఆయా ప్రాంతాల ప్రజలు అవసరమైన తాగునీటి నిల్వ చేసుకోవాలని, అత్యవసర తాగునీటి సేవలకు https://cmwssb.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. అలాగే, తాగునీటి కనెక్షన్ లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయనున్నట్లు మెట్రో వాటర్ బోర్డు తెలియజేసింది.

టీవీకే ఆధ్వర్యంలో చలివేంద్రాలు

వాషర్‌మెన్‌పేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని పార్టీ అధ్యక్షుడు విజయ్ నేతలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ విడుదల చేసిన ప్రకటనలో...ఈ ఏడాది ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, చలివేంద్రాలు ఏర్పాటుచేసి మజ్జిగ, నీరు పంపిణీ చేయాలన్నారు.



దుకాణాలను తొలగిస్తున్న అధికారులు, పోలీసులు - బైక్ పార్కింగ్ నిర్మాణం పనుల్లో కార్మికులు

తిరుత్తణి ఆలయ పరిసరాల్లో పూలదుకాణాల తొలగింపు

వ్యాపారుల నిరసన

తిరుత్తణి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయం బయటవున్న సుందర వినాయక ఆలయం ముందున్న సుమారు పది దుకాణాలను అధికారులు బుధవారం ఉదయం తొలగించారు. వినాయక ఆలయం పక్కనున్న సర్వే నెంబరు-345/27లో ఉన్న ఖాళీ స్థలాన్ని డీఎంకే నేత వేలంపాటలో రూ.3 లక్షలకు కొనుగోలు చేశారు. అనంతరం ఆ ప్రదేశంలో బైక్స్, సైకిల్ పార్కింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో దానికి అడ్డుగావున్న పది దుకాణాలను ఆదివారం ఉదయం తొలగించారు. దీనిని ఖండిస్తూ తామంతా పేదలమని గత 40ఏళ్లుగా ఇక్కడే వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, దీనికి మున్సిపాలిటీకి రోజు అద్దె రూ.20 నుండి రూ.50 వరకు చెల్లిస్తున్నామని తెలిపారు. దానికి ప్రభుత్వం కూడా గుర్తింపుకార్డులను కేటాయించారని అధికారులతో వాపోయారు. అయినా అధికారులు, షాపులను బలవంతంగా తొలగించడంతో వ్యాపారస్థులు అధికారులతో వాగ్విదానికి దిగారు. దీనిపై స్పందించిన అక్కడి బీజేపీ న్యాయవాది సూరి అధికారులతో మాట్లాడుతూ, ఈ దుకాణాలను తొలగించే హక్కు లేదని, అయినా రూ.44 కోట్లు విలువైన స్థలాన్ని అధికార పార్టీ నేతకు కేవలం రూ.3 లక్షలకే అప్పగిస్తారా? అంటూ అధికారులతో వాదనకు దిగారు. ఈ స్థలానికి ఇంతకు ముందే సర్వే నెంబరు ఉందని, దీనిపై దేవాదాయ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేరంటూ మంత్రి పీకే శేఖర్‌బాబును విమర్శించారు. అయినప్పటికీ అధికారులు వీటిని లెక్కచేయకుండా పోలీసు బందోబస్తుతో ఆ దుకాణాలన్నిటిని ఖాళీ చేయించడం గమనార్హం.

ఆస్తి పన్ను వసూలు కోసం మాజీ మంత్రి కార్యాలయం ఎదుట చెత్త తొట్టె

● పార్టీ శ్రేణుల నిరసనతో తొలగింపు



మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ కార్యాలయ భవనం ఎదుట ఉంచిన చెత్తకుప్పల తొట్టె

టి.నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ పార్టీ కార్యాలయం ఎదుట మదురైలో కార్పొరేషన్ అధికారులు చెత్తకుప్పతొట్టి ఉంచడంతో కలకలం సృష్టించింది. ఆ కార్యాలయ భవన యజమాని ఆస్తిపన్ను బకాయిపడటంతో కార్పొరేషన్ అధికారులు ఈ చర్యలకు ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న అన్నాడీఎంకే కార్యకర్తలు ఆర్బీ ఉదయకుమార్ కార్యాలయం ఎదుట చేరి రాస్తారోకోకు సిద్ధమవటంతో కార్పొరేషన్ అధికారులు హుటాహుటిన వెళ్ళి చెత్త తొట్టెను తొలగించారు. ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో మదురై కార్పొరేషన్ అధికారుల ఆస్తి పన్ను చెల్లించని ఇళ్లు, దుకాణాలు, ఆసుపత్రులు, ప్రైవేటు మాల్స్, పాఠశాలలకు మురుగు, తాగునీటి కనెక్షన్లు తొలగించడమే కాకుండా ఇళ్లు, దుకాణాలు, మాల్స్ ఎదుట చెత్తకుప్పలు పారబోస్తున్నారు. కార్పొరేషన్ చేపట్టిన ఈ చిట్కా సత్ఫలితాలనిస్తున్నాయి. ఆ కోవలోనే మదురై కార్పొరేషన్ సెకండ్‌జోన్ 33వ వార్డులో ఉన్న భవనసముదాయం యజమాని లక్షలాది రూపాయలమేరకు ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో ఆ భవనం ముందు పెద్ద కుప్పతొట్టె ఉంచారు. ఆ తొట్టెలోని చెత్త నుంచి దుర్వాసన వ్యాపించింది. ఆ భవన సముదాయంలోనే శాసనసభలో అన్నాడీఎంకే సభాపక్ష ఉపనాయకుడు, మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ పార్టీ కార్యాలయం కూడా ఉంది. ఆర్బీ ఉదయకుమార్ న్యాయవాదిగా ఉన్నప్పటి నుండి ఈ కార్యాలయంలోనే పార్టీ వ్యవహారాలను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్బీ ఉదయకుమార్ కార్యాలయం ఎదుట చెత్త తొట్టె ఉంచారనే విషయం తెలుసుకుని పార్టీ కార్యకర్తలు గుమికూడారు. ఆలోగా కార్పొరేషన్ అధికారులు ఆ తొట్టెను తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి వెళ్ళారు. ఈ విషయం ఆ భవనసముదాయ యజమానికి తెలియటంతో ఆయన కార్పొరేషన్ ఉన్నతాధికారులను కలుసుకుని ఆస్తి పన్ను బకాయిలను త్వరలో చెల్లిస్తానని హామీ ఇచ్చారు.

వచ్చే వేసవి వరకు చెన్నైలో నీటి సరఫరాకు కొరతలేదు

● అసెంబ్లీలో మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవి వరకు చెన్నై నగరానికి నీటి సరఫరాకు కొరతేవుండదని మంగళవారం అసెంబ్లీ సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖామంత్రి కేఎన్ నెహ్రూ ప్రకటించారు. అసెంబ్లీలో బుధవారం బడ్జెట్‌పై సాగిన చర్చలో పాల్గొన్న పలువురు సభ్యులు తాగునీటి సరఫరాకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో వలసరవాక్కం ప్రాంతంలో అదనంగా నీటి ట్యాంక్ ఏర్పాటు చేస్తారా? అని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే కారపాక్కం గణపతి ప్రశ్నించారు. దీనికి మంత్రి సమాధానమిస్తూ, రాజధాని నగరంలో గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 900 ఎంఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేశారని, ప్రస్తుతం 1,110 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే వేసవి వరకు నగరవాసులకు కొరతలేకుండా నీటిని పంపిణీ చేసేలా రిజర్వాయర్లలో నీరు సమృద్ధిగా వుందని మంత్రి కేఎన్ నెహ్రూ వివరించారు.

ఎస్డీపీఐ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో వివిధ పార్టీల నేతలు

వేలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్డీపీఐ ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బషీర్ అహ్మద్, అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఆజాద్ నేతృత్వం వహించగా, అన్నాడీఎంకే మా నగర జిల్లా సెక్రటరీ అప్పు, డీపీఐ మా నగర జిల్లా సెక్రటరీ ఫిలిప్, డీఎండీకే మా నగర జిల్లా సెక్రటరీ పురుషోత్తమన్ ఇస్లామీయులు పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 26 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్య తలు చేపట్టిన అరుణ్, ప్రజలు, పోలీసుల సమస్యలు తెలుసుకొనేందుకు ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 26 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలు విచారించి పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.

దివ్యాంగులకు సహాయ పరికరాలు

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకంలో దివ్యాంగుల కోసం నగరంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో అంధులు, బధిరులు బుద్ధిమాంద్యం కలిగిన వారికి అవసరమైన పరికరాలు అందించనున్నారు. పెరంబూర్ పరిధిలో మాధవరం హైరోడ్డులోని చెన్నై మాధ్యమిక పాఠశాల ప్రాంగణంలో గురువారం, అన్నానగర్ పరిధిలో అరుంబాక్కం ఎంఎండీఏ కాలనీలోని చెన్నై మాధ్యమిక పాఠశాలలో ఈ నెల 21, తిరువొత్తియూర్ పరిధిలో పుళల్ పాపిలి రాజా మహోన్నత పాఠశాలలో ఈ నెల 22, కొళత్తూర్ పరిధిలో తిరువిక నగర్ పల్లవన్ రోడ్డులోని చెన్నై మైనార్టీ పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 24, తండయార్‌పేట పరిధిలో కొరుక్కుపేట రైల్వేస్టేషన్ సమీపంలోని సీఎస్ మీనాంబాళ్ నగర్‌లో ఈ నెల 25న శిబిరాలు జరుగున్నాయి. వివరాలకు 044-29993612 నెంబరు సంప్రదించవచ్చని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

సీబీఐ కోర్టుకు హాజరైన మంత్రి పొన్ముడి

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు బదిలీ చట్టం కేసులో మంత్రి పొన్ముడి, ఆయన కుమారులు చెన్నైలోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. 2006నుంచి 2011 వరకు డీఎంకే ప్రభుత్వంలో ఉన్నతవిద్య, ఖనిజ వనరులు,గనులశాఖ మంత్రిగా పనిచేసిన పొన్ముడి, విల్లుపురం జిల్లాలో అనుమతి కంటే ఎర్రమట్టి అధికంగా తీయడం ద్వారా ప్రభుత్వానికి రూ.28.36 కోట్ల నష్టం వచ్చిందనే ఫిర్యాదులతో పొన్ముడి, ఆయన కుమారుడు గౌతమ శిఖామణి, బంధువు రాజమహేంద్రన్ తదితరులపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదుచేసింది. ఈ కేసు జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో, ఈ కేసు సీబీఐ ప్రత్యేక కోర్టులోపి విచారణకు రాగా, ఈడీ అదనపు ఛార్జిషీటు దాఖలుచేసింది. అందులో... మంత్రి పొన్ముడి, ఆయన కుమారులు గౌతమ శిఖామణి, అశోక్ శిఖామణి తదితరులు డైరెక్టర్లుగా ఉన్న ఆస్తులు, కంపెనీలపై ఆరోపణలు చేసింది. ఈ అదనపు ఛార్జిషీటు విచారణకు స్వీకరించిన సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎళిల్ వెలవన్... అదనపు ఛార్జిషీటులో ఉన్న పొన్ముడి, గౌతమ శిఖామణి, అశోక్ శిఖామణిలు నేరుగా హాజరుకావాలని సమన్లు జారీచేశారు. ఆ ప్రకారం, పొన్ముడి, ఆయన ఇద్దరు కుమారులు బుధవారం సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. మంత్రిగా ఉన్న కారణంగా తదుపరి విచారణ హాజరు నుంచి మినహాయింపు కల్పించాలని పొన్ముడి తరపున పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌కు బదులు పిటిషన్ దాఖలు చేయాలని ఈడీకి కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

నోరు జారిన మాట.. చేజారిన పదవి

● పార్టీ పదవి చేపట్టిన 24 రోజులకే ధర్మపురి డీఎంకే నేతకు ఉద్వాసన



ఉద్వాసనకు గురైన ధర్మసెల్వన్

టి.నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ పదవిని చేపట్టిన 24 రోజుల్లోనే డీఎంకే ధర్మపురి తూర్పు జిల్లా కార్యదర్శి పి.ధర్మసెల్వన్‌ను ఆ పదవి నుండి పార్టీ అధిష్టానం తొలగించింది. పెన్నగరం శాసనసభ నియోజకవర్గం పరిధిలో కూత్తంపాడికి చెందిన ధర్మసెల్వన్ డీఎంకేలో ప్రధాన కార్యాచరణ మండలి సభ్యుడిగా, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఫిబ్రవరి 22న ధర్మపురి తూర్పు జిల్లా కార్యదర్శిగా ఉన్న తడంగం సుబ్రమణియంను ఆ పదవి నుండి తొలగించి, ధర్మసెల్వన్‌ను డీఎంకే ప్రధాన కార్యదర్శి, నీటి వనరుల శాఖ మంత్రి దురైమురుగన్ నియమించారు. ధర్మసెల్వన్ జిల్లా కార్యదర్శి పదవి చేపట్టిన వారం రోజులకే ధర్మపురి, పెన్నాగరం శాసనసభ నియోజకవర్గాల్లో పార్టీకి, ప్రభుత్వానికి కళంకం తెచ్చేలా ప్రవర్తించారు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ ఇలా ఎంత పెద్ద అధికారి అయినా సరే తన మాటకు కట్టుబడాలి లేకుంటూ వెళ్ళిన ప్రతిచోటా మాట్లాడారు. ఈ మాటలను ఎవరో సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఈ విషయం తెలియగానే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పాలకపక్షంపై ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఉన్నతాధికారులను డీఎంకే స్థానిక నేతలు బహిరంగంగా బెదరించే స్థాయికి ఎదిగిపోయారంటూ విమర్శించారు. ఈ పరిస్థితులలోనే ధర్మసెల్వన్‌ను పార్టీ పదవి నుండి తొలగిస్తున్న దురైమురుగన్ ప్రకటించారు. అదే సమయంలో ధర్మపురి తూర్పు జిల్లా శాఖకార్యదర్శిగా ధర్మపురి ఎంపీ, న్యాయవాది ఎ. మణిని నియమిస్తున్నట్లు ప్రకటించారు.

● పెరియార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారం....

హైకోర్టులో సీమాన్‌కు చుక్కెదురు

టి.నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ ఉద్యమనేత పెరియార్‌పై చేసిన విమర్శలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా తనపై నమోదు చేసిన సుమారు 50 కేసులను ఒక్కటిగా చేర్చి విచారణ జరపాలని కోరుతూ నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) నేత సీమాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జీకే ఇలంతిరయన్ సీమాన్‌పై ఏయే పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి, ఇప్పటివరకూ ఎన్ని పోలీసుస్టేషన్లు సమన్లు ఇచ్చాయనే వివరాలను స్పష్టంగా పేర్కొనకుండా అన్ని కేసులు ఒక్కటిగా చేర్చి విచారణ జరపాలని కోరటం భావ్యం కాదని చెబుతూ పిటిషన్‌ను తోసిపుచ్చారు. సమగ్రమైన వివరాలను మరో పిటిషన్ దాఖలు చేస్తే విచారణ జరుపుతామని న్యాయమూర్తి తెలిపారు.

పార్టీ జెండాలు తొలగించండి: డీఎంకే

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాల్లో ఉన్న పార్టీ జెండాలు తొలగించాలని డీఎంకే అధిష్టానం ప్రకటించింది. రాజకీయ పార్టీలు రోడ్డు పక్కన, బహిరంగ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన జెండాలతో ప్రజలు ఇబ్బందులు పడడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందంటూ దాఖలైన ప్రజావ్యాజ్యాన్ని విచారించిన మద్రాసు హైకోర్టు మదురై బెంచ్, బహిరంగ ప్రాంతాలు, రోడ్డు పక్కన ఉన్న పార్టీ జెండాలు తొలగించాలంటూ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... బహిరంగ ప్రాంతాల్లో ఉన్న పార్టీ జెండాలు తొలగించాలన్నారు. ఆయా ప్రాంతాల పార్టీ నేతలు 15 రోజుల్లో జెండాలు తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వళ్లువర్‌కోట్టం వద్ద ఆందోళనలకు నిషేధం

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వళ్లువర్‌కోట్టం సమీపంలో ఆందోళనలపై నిషేధం విధిస్తున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వులు జారీచేశారు. నగరంలో ప్రధాన ప్రాంతమైన వళ్లువర్‌కోట్టం సమీపంలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. . కొద్దికాలంగా రాజకీయ పార్టీలు వళ్లువర్‌కోట్టం సమీపంలో ఆందోళనలు చేపడుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అదే సమయంలో వళ్లువర్‌కోట్టం వద్ద ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా పై ఓవర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ కారణంగా ఇక నుంచి వళ్లువర్ కోట్టం వద్ద ఆందోళనకు అనుమతి లేదని, దానికి బదులు ట్రిప్లికేన్ శివానంద రోడ్డులో ఆందోళనలకు అనుమతించనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు



చిన్నారి వెట్రివేల్ - చంద్రమౌళి

తిరుత్తణి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో ఓ బాలుడు తీవ్రగాయాలై సంఘటన తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట సమీపంలోని మారకుప్పం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రెండేళ్ల వెట్రివేల్ సోమవారం రాత్రి ఇంటివద్ద ఆడుకుంటున్న సమయంలో వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. అది చూసిన చిన్నారి తల్లిదండ్రులు కుక్కలను తరిమికొట్టి, చిన్నారిని వేలూరులోని సీఎంసీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు చికిత్సకు సుమారు రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలుపగా, రోజువారీ కూలీ పనిచేసుకునే మా దగ్గర అంత డబ్బులేదని ఆసుపత్రి వద్ద రోదించారు. అదేవిధంగా మంగళవారం అదే ప్రాంతంలో సాయంత్రం పాఠశాల నుండి ఇంటికి వస్తున్న చంద్రమౌళి అనే మరో బాలుడిని కూడా ఈ కుక్కలు గాయపరిచాయి. ఆ బాలుడు ఆర్కేపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై అక్కడి స్థానికులు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతోందని అధికారులు వెంటనే వీటిపై స్పందించి, చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

ఆందోళనల్లో పాల్గొంటే వేతనం కట్

● రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరిక

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విధులకు హాజరుకాకుండా ఆందోళనల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత విధిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. పలు కోర్కెలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘా సమాఖ్య బుధవారం ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో, విధులకు హాజరుకాకుండా ఆందోళనలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగుల వేతనం కట్ చేస్తామని, బుధవారం ఉద్యోగాలకు రాని వారి వివరాలు మానవనరుల శాఖకు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వైద్యం కోసం సెలవు మినహా సాధారణ, ఇతర సెలవులు తీసుకోరాదని ప్రభుత్వం తెలియజేసింది.

అనారోగ్యంతోనే భక్తుల మృతి

● మంత్రి శేఖర్‌బాబు

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఇద్దరు భక్తులు మృతిచెందారని, రద్దీ వల్ల కాదని హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. తిరుచెందూర్ ఆలయానికి ఈ నెల 16వ తేది స్వామి దర్శనానికి వెళ్లిన కారైక్కుడికి చెందిన ఓంకుమార్, క్యూలైన్‌లో ఉండగా స్పృహతప్పి మృతిచెందాడు. అలాగే, రామేశ్వరం ఆలయంలో మంగళవారం ఓ భక్తుడు మృతిచెందాడు. భక్తుల మృతికి క్యూ లైన్‌లో రద్దీ కారణమని, రద్దీని అదుపుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, మంత్రి పీకే శేఖర్‌బాబు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... రెండు ఆలయాల్లో భక్తుల మృతికి వారి అనారోగ్యమే కారణమన్నారు. భక్తులకు అత్యవసర చికిత్స అందించేలా 17 ఆలయాల్లో ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. అలాగే, అన్ని ఆలయాల్లో తాగునీరు, మరుగుదొడ్ల వసతితో పాటు వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు దర్శనానికి వెళ్లేందుకు ప్రత్యేక వసతి ఏర్పాటుచేశామని మంత్రి తెలిపారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● ట్యూషన్ మాస్టర్ అరెస్ట్

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ట్యూషన్ మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా విరుదాచలం సమీపం ఓ ప్రాంతానికి చెందిన వ్యక్తి (42) 20 ఏళ్లుగా ట్యూషన్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ ట్యూషన్‌లో 17 ఏళ్ల ప్లస్ టూ విద్యార్థిని చదువుతోంది. ఈ నేపథ్యంలో, కొద్దిరోజుల క్రితం విద్యార్థినిపై టీచర్ వెంకటేశన్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయాన్ని బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి టీచర్‌ను అరెస్ట్ చేశారు.

ప్రభుత్వ వైద్యుడు... : తిరునల్వేలి జిల్లా పాండికుడి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలచంద్ర వైద్యుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఓ యువతి వైద్య కోసం రాగా, ఆ యువతితో బాలచంద్ర అసభ్యకరంగా మాట్లాడినట్లు తెలిసింది. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు మహిళల వేధింపుల చట్టం కింద కేసు నమోదుచేసి వైద్యుడిని అరెస్ట్ చేశారు.

మహిళా లెక్చరర్‌పై .....

● అజ్ఞాతంలోకి వైస్ ప్రిన్సిపాల్

వేలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వందేళ్ల చరిత్ర కలిగిన ఊరీసు కళాశాలలో లెక్చరర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన సంచలనం రేపింది. ఊరీసు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అదే కళాశాలలో పనిచేస్తున్న మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయమై బాధితురాలు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, వారు ఫిర్యాదు తీసుకోలేదని సమాచారం. దీంతో, ఆమె జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాలతో కేసు నమోదుచేసిన మహిళా పోలీసులు, పరారీలో ఉన్న వైస్ ప్రిన్సిపాల్ కోసం గాలిస్తున్నారు.

ఏనుగును చంపిన కేసులో ముగ్గురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న దంతాలతో నిందితులు

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లాలో ఏనుగును చంపి దహనం చేసి దంతాలు తీసుకెళ్లిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. యామనూరు అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి విజయకుమార్, గోవిందరాజు, దినేష్‌లను అరెస్ట్ చేసిన అటవీ సిబ్బంది వారి నుంచి రెండు దంతాలు, నాటు తుపాకి, పేలుడు సామగ్రి, కత్తులు స్వాదీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



తిరుత్తణి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపంలోని పోదటూర్‌పేట బస్టాండ్ సమీపంలో వాసంతి అనే ఓ మహిళ తన ఇంటిబయటే టీ దుకాణాన్ని నడుపుతోంది. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో టీ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. వెంటనే వాసంతి లేవడంతో కుటుంబ సభ్యులంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. కానీ ఇంట్లోని సామగ్రి మంటల్లో కాలిపోయాయి. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసి, గాయపడిన వాసంతి కుటుంబ సభ్యులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

15 నుంచి చెన్నై-గోవా విమాన సేవలు

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి గోవాకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ ఏప్రిల్ 15వ తేది నుంచి డైరెక్ట్ విమానాలు నడుపనుంది. ఇప్పటికే ఇండిగో సంస్థ ఈ రెండు నగరాల మధ్య విమానం నడుపుతుండగా, ప్రయాణికుల సంఖ్య అధికమవుతోంది. దీంతో, ప్రయాణికులు ఇతర నగరాలకు వెళ్లి గోవాకు వెళ్ళాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో, చెన్నై నుంచి గోవాకు ఏప్రిల్ 15వ తేది నుంచి విమానాలు నడుపున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటించింది. ఆ ప్రకారం, చెన్నై నుంచి సాయంత్రం 6.55 గంటలకు బయల్దేరే విమానం రాత్రి 8.35 గంటలకు గోవా చేరుకుంటుంది. అలాగే, గోవా నుంచి సాయంత్రం 4.40 గంటలకు బయల్దేరి 6.20 గంటలకు చెన్నై చేరుకుంటుంది. ఈ రెండు మార్గాల్లో ఎయిర్ బస్ 320 రకం విమానాలు నడుపనున్నట్లు ఆ సంస్థ ప్రకటనలో తెలిపింది.



అర్జిత్‌ను హీరోగా పరిచయం చేయనున్న ప్రభుదేవా

ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ కుమారుడు అర్జిత్‌ను నృత్యదర్శకుడు, దర్శకనటుడు ప్రభుదేవా హీరోగా పరిచయం చేయనున్నారు.ఇందుకోసం సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రముఖ దర్శకుడు ఏఆర్.మురుగదాస్ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేస్తున్న అర్జిత్... భవిష్యత్‌లో తన తండ్రిలాగే మంచి దర్శకుడిగా గుర్తింపు పొం దుతారని భావించారు.కానీ, అర్జిత్ హీరోగా పరిచయం కానున్నట్టు సమాచారం.ఈ చిత్రానికి ప్రభుదేవా దర్శకత్వ బాధ్యతలను చేపట్టనున్నట్టు వినికిడి. తన కెరీర్ ప్రారంభంలో నృత్య దర్శకుడుగా పరిచయమైన ప్రభుదేవా డైరెక్టర్ ఎస్. శంకర్ తన తొలి చిత్రం 'జెంటిల్‌మేన్'లో ఒక పాటకు ప్రభుదేవాతో డ్యాన్స్ చేయించారు.శంకర్ తదుపరి చిత్రం 'కాదలన్'లో ప్రభుదేవాను హీరోగా పరిచయం చేశారు. ఈ నేపథ్యంలో శంకర్ కుమారుడు అర్జిత్‌ను ప్రభుదేవా ఇపుడు హీరోగా పరిచయం చేయనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.

తమిళ చిత్రజ్యోతి



లండన్‌లో సింఫనీ కచ్చేరి చేసిన ఇసైజ్ఞాని ఇళయరాజాను బుధవారం చెన్నైలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు చెబుతున్న సీనియర్ నటుడు శివకుమార్, ఆయన కుమారుడు, నటుడు సూర్య, బృంద తదితరులు

సినీ నిర్మాణం నుంచి
తప్పుకోనున్న లైకా?



సుభాస్కరన్

ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సినిమా నిర్మాణం నుంచి తప్పుకోనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. విజయ్ నటించిన 'కత్తి' మూవీతో కోలీవుడ్ చిత్ర నిర్మాణంలోకి ఈ సంస్థ అడుగుపెట్టింది. ఆ తర్వాత అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించి అతిపెద్ద సినీ నిర్మాణ కంపెనీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో '2.0', 'చెక్క సివంద వానం' 'డాన్', 'పొన్నియిన్ సెల్వన్-1, 2' వంటి చిత్రాలు నిర్మించగా, ఇవి విజయవంతం కావడంతోపాటు మంచి లాభాలను తెచ్చిపెట్టాయి. కానీ, గత కొంతకాలంగా ఆ సంస్థకు ఏమాత్రం కలిసి రావడం లేదు. ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహించిన 'లాల్‌సలామ్', 'చంద్రముఖి-2', 'ఇండియన్-2' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఆ తర్వాత వచ్చిన 'వేట్టయన్', 'విడాముయర్చి' చిత్రాలు కూడా ఆశించిన మేరకు ప్రజాదరణ పొందలేకపోయాయి. దీంతో లైకా నిర్మాణ సంస్థకు ఆర్థిక సమస్యలు తలెత్తినట్టు సమాచారం. అదేసమయంలో మోహన్‌లాల్ నటిస్తున్న 'ఎంపురాన్' సినిమాకు సహ నిర్మాతగా ఉన్న లైకా... ఇపుడు ఈ ప్రాజెక్టు నుంచి కూడా తప్పుకుంది. ప్రస్తుతం ఆ సంస్థ చేతిలో రెండు చిత్రాలు మాత్రమే ఉన్నాయి. వాటిలో ఒకటి 'ఇండియన్-3' కాగా, రెండోది విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకత్వం వహించే చిత్రం. జేసన్ చిత్రంలో లైకా సంస్థ సినిమా నిర్మాణ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కడంతో పాటు అప్పులు తీర్చిన తర్వాతే మళ్ళీ సినీ నిర్మాణం వైపు మొగ్గు చూపాలని నిర్మాత లైకా సుభాస్కరన్ నిర్ణయం తీసుకున్నట్టు కోలీవుడ్ ట్రేడ్ వర్గాల సమాచారం.

ఇది మన ఊరి రంగే కదా?
● ఐశ్వర్య రాజేష్

తన వంటి రంగుపై ఓ విద్యార్థి చేసిన కామెంట్స్‌కు హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తగిన రీతిలో సమాధానమిచ్చింది. తన స్కిన్ కలర్ మన ఊరి రంగే కదా అంటూ బదులిచ్చారు. 'కాక్కాముట్టై' చిత్రం ద్వారా ఇండస్ట్రీలో గుర్తింపు పొందిన ఐశ్వర్య రాజేష్.. ఇపుడు తమిళంతో పాటు తెలుగులోనూ మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ కాలేజీలో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఒక విద్యార్థి మాట్లాడుతూ, 'మీ ఒరిజినల్ కలర్ ఇదేనా? అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్న వినగానే ఒకింత ఆశ్చర్యానికి లోనైన ఐశ్వర్య.. ఆ తర్వాత తేరుకుని చాలా కూల్‌గా సమాధానమిచ్చారు. 'నేను పెద్ద కలర్ కాదు. పెద్ద నలుపూ కాదు. చామన చాయ రంగు. ఈ తరహా రంగులో ఉండే మహిళలే ఎంతో అందంగా ఉంటారు. మన ఊరు కలర్ ఇదే కదా. అదే కదా అందం' అంటూ సమాధానమిచ్చారు.



ప్రజాసేవకు వచ్చిన పార్టీ
● నటుడు సౌందరరాజా



దుబాయ్ టీవీకే ప్రతినిధులతో నటుడు సౌందరరాజా

మాతృరాష్ట్రానికి, ప్రజలకు మేలు చేసేందుకు వచ్చిన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) అని సినీ నటుడు సౌందరరాజా అన్నారు. టీవీకే దుబాయ్ విభాగం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌందరరాజా మాట్లాడుతూ, 'టీవీకే ప్రజలకు మాతృ రాష్ట్రానికి సేవ చేయడానికి ఆవిర్భవించిన పార్టీ. కానీ, ఈర్ష్యతో రగిలిపోతున్న కొందరు ఆ పార్టీపై తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు.. ఇలాంటి విమర్శలను ఎవరూ పెద్దగా పట్టించుకోకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, తమిళగ వెట్రి కళగానికి స్వరాష్ట్రం, భారతదేశంలోనే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతుందని, ఈ పరిస్థితుల్లో ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా టీవీకే కార్యకర్తలే బాధితులకు అండగా నిలబడి సమస్యను పరిష్కరించాలి' అని కోరారు. కాగా నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా చిత్రపరిశ్రమలో రాణిస్తున్న సౌందరరాజా... మన్నుక్కు, మక్కళుక్కుం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడిగా పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు.



జూన్‌లో వేళచ్చేరి - పరంగిమలై మధ్య
ఎంఆర్‌టీఎస్ రైళ్ల పరుగులు





టి.నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వేళచ్చేరి - పరంగిమలై (సెయింట్ థామస్ మౌంట్) ఎంఆర్‌టీఎస్ (మాస్‌రాపిడ్ ట్రాన్స్‌పోర్టింగ్ సిస్టమ్స్) రైళ్లు జూన్‌లో పరుగులు తీయనున్నాయి. అర కిలోమీటరు వరకు స్థలసేకరణలో ఏర్పడిన అడ్డంకులు 15 యేళ్ల సుదీర్ఘ న్యాయపోరాటంతో తొలగిపోయాయి. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రైలు మార్గం నిర్మాణ పనులు జూన్‌తో పూర్తి కానున్నాయి. నగరంలో ఎంఆర్‌టీఎస్ రైల్వే ప్రాజెక్టు మూడు దశలుగా అమలు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు మొదటి దశగా చెన్నై బీచ్ - మైలాపూరు మధ్య 1984లో రైలు మార్గం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 1995లో పనులు పూర్తవడంతో ఆ మార్గంలో వంతెనలపైనే ఎంఆర్‌టీఎస్ రైలు సర్వీసులు ప్రారంభమయ్యాయి. 1998లో మైలాపూరు - వేళచ్చేరి మధ్య రెండో దశ రైలు మార్గం పనులు చేపట్టారు. 2004 పనులు పూర్తయి ఆ మార్గంలో రైలు సేవలు ప్రారంభించారు. ఈ రెండో దశ ప్రాజెక్టు కొనసాగింపులో భాగంగా 2008లో వేళచ్చేరి - పరంగిమలై మధ్య రూ.495 కోట్లతో 5 కిలోమీటర్ల మేర రైలు మార్గం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో 4.5 కిలోమీటర్ల వరకు 167 స్తంభాలపై రైలు మార్గం నిర్మించే పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదంబాక్కం, థిల్లైగంగానగర్ ప్రాంతాల్లో స్థలసేకరణను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులో కేసులు వేశారు. దీంతో ఆదంబాక్కం - పరంగిమలై మధ్య కేవలం అర కిలోమీటరు మేర రైలు మార్గం పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి.

ఇదిలా ఉండగా 15 యేళ్ల సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత స్థలసేకరణలో ఎదురైన అడ్డంకులు తొలగి సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి. దీంతో గత యేడాది రైలు మార్గం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో థిల్లై గంగానగర్ ప్రాంతంలో సిమెంట్ స్తంభాలపై అమర్చిన కాంక్రీటు దిమ్మెలు కూలాయి. ఆ తర్వాత పనులు నత్తనడక నడిచాయి. ఆ కాంక్రీటు దిమ్మెలు కూలిపడటానికి గల కారణాలు ఇంజనీరింగ్ నిపుణులు గుర్తించి పనుల్లో సవరణ చేశారు. ప్రస్తుతం అక్కడ స్తంభాలపై కాంక్రీటు దిమ్మెలు అమర్చి, వాటిపై రైలు పట్టాలను బిగిస్తున్నారు. అంతేకాకుడా వేళచ్చేరి నుండి పరంగిమలై రైల్వేస్టేషన్‌ను కలిపే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. దీంతో వేళచ్చేరి - పరంగిమలై ఎంఆర్‌టీఎస్ రైలు మార్గం నిర్మాణం 80 శాతం పూర్తయింది. తక్కిన 20 శాతం పనులు వచ్చే జూన్‌లోగా పూర్తవుతాయని రైల్వే ఉన్నతాధికారులు చెబుతున్నారు. వేళచ్చేరి - పరంగిమలై ఎంఆర్‌టీఎస్ రైలు మార్గం పనులకు మొదట రూ.495 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. 2010లో ఈ ప్రాజెక్టును ముగించాలని నిర్ణయించారు. అయితే యేళ్ల తరబడి ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభం కాకపోవటంతో ప్రాజెక్టు అంచనా వ్యయం కాస్తా రూ.734 కోట్లకు పెరిగింది. ఆ మేరకు అదనంగా రూ.239 కోట్ల మేర నిధులు వ్యయం చేయాల్సి వచ్చింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే బీచ్ నుంచి పరంగిమలైకి రవాణా ఖర్చులు చాలా వరకు ఆదా అవుతాయి.

మూడు టెర్మినళ్ల స్టేషన్‌గా...

పరంగిమలై రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం లోకల్ రైళ్లు నడుస్తున్నాయి. బీచ్ - పరంగిమలై ఎంఆర్‌టీఎస్ రైలు మార్గం పనులు పూర్తయి ఈ మార్గంలోనూ రైళ్లు పరంగిమలై స్టేషన్‌కు వరకు నడుపుతారు. వీటన్నింటికీ తోడు ప్రస్తుతం ఈ స్టేషన్ మీదుగా మెట్రోరైలు కూడా నడుపబోతున్నారు. ఇటు ఎంఆర్‌టీఎస్ రైలు మార్గం, అటు మెట్రోరైలు మార్గం నిర్మాణం పనులు పూర్తయితే మూడు రైల్వే టెర్మినల్స్ కలిగిన రైల్వేస్టేషన్‌గా పరంగిమలై రైల్వేస్టేషన్ ఖ్యాతి చెందనుంది.

ఎంఆర్‌టీసీ మార్గంపై మెట్రోరైలు...

చెన్నై మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టు అమలులో భాగంగా మాధవరం నుండి చోళింగనల్లూరు వరకు మెట్రోరైలు మార్గం పరంగిమలై రైల్వేస్టేషన్ మీదుగా నిర్మించనున్నారు. ఈ మెట్రో రైలు మార్గాన్ని ప్రస్తుతమున్న వేళచ్చేరి - పరంగిమలై ఎంఆర్‌టీఎస్ రైలు మార్గంపై మరింత ఎత్తున నిర్మించనున్నారు. అంత ఎత్తున ఆ చోట మెట్రో రైలులో ప్రయాణించడం నగరం వాసులకు వింత అనుభూతి కలిగించనుంది.

పాక్షికంగా ఆటో డ్రైవర్ల సమ్మె



ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

ప్యారీస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కనీస మీటరు ఛార్జ్ నిర్ణయించాలనే డిమాండ్‌తో నగరంలో బుధవారం ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో పాక్షిక సమ్మె జరిగింది. 70శాతానికి పైగా ఆటోలు యధావిధిగా తిరగడంతో ప్రయాణికులకు ఇబ్బంది కలగలేదు. గడిచిన 12 ఏళ్ళుగా కనీస మీటర్‌ఛార్జ్ నిర్ణయించడానికి ఎలాంటి చర్యలు తీసుకోని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, నగరంలోని ఆటో డ్రైవర్ల సంఘాల పిలుపుమేరకు సంఘంలో సభ్యులైన ఆటో డ్రైవర్లు ఒకరోజు సమ్మెలో పాల్గొన్నారు. అదేవిధంగా తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో ఆటో డ్రైవర్ల సమ్మె పాక్షికంగానే జరిగిందని రాష్ట్ర ఆటో కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం తెలిపారు. వల్లువర్‌కోట్టంలో జరిగిన ఆటోడ్రైవర్ల ధర్నా సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లపై విధిస్తున్న ఆన్‌లైన్ జరిమానాల కారణంగా ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, తమ కోరికలను పరిష్కరించకపోతే 24వ తేదీ సచివాలయాన్ని ముట్టడించి నిరసన తెలియజేయనున్నట్లు ఆయన హెచ్చరించారు.

క్షేమంగా తిరిగొచ్చిన సునీతా విలియమ్స్‌కు
అసెంబ్లీలో స్టాలిన్ అభినందన

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో 9నెలలు గడిపి బుధవారం సురక్షితంగా తిరిగొచ్చిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉదయం శాసనసభలో ఓ ప్రకటన చేస్తూ సునీతా విలియమ్స్ క్షేమంగా భూమికి తిరిగి రావాలని కోట్లాదిమంది ప్రజలు కోరుకున్నారని, ఎట్టకేలకు వారి కోరిక నెరవేరిందని ఆమె సురక్షితంగా తిరిగొచ్చారన్నారు. సునీతా విలియమ్స్ ఆమె సహచరులను సురక్షితంగా తరలించేందుకు కృషి చేసిన నాసా బృందానికి, ఇతర అంతరిక్ష నిపుణులందరికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఓ ప్రకటన జారీ చేస్తూ అంతరిక్ష కేంద్రం నుంచి వెంటనే తిరిగి రాలేకపోయినా సునీతా విలియమ్స్ ఆత్మస్థైర్యంతో 9 నెలలపాటు అక్కడే గడిపి సురక్షితంగా తిరిగి రావటం అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె ధైర్యసాహసాలకు జోహార్లు అని తెలిపారు.



అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రంలో 9నెలలు గడిపి బుధవారం సురక్షితంగా తిరిగొచ్చిన వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను ఆహ్వానిస్తూ కోయంబత్తూర్‌లో ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

ఎన్‌ఎల్‌సీ శిక్షణ కేంద్రానికి ఎన్‌ఎస్‌సీఎస్‌టీఐ గుర్తింపు



ఉద్యోగులను అభినందిస్తున్న ప్రసన్నకుమార్ మోటుపల్లి

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ నేతృత్వంలోని శిక్షణ అభివృద్ధి కేంద్రానికి 'నేషనల్ స్టాండర్డ్ ఫర్ సివిల్ సర్వీసెస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్ఎస్‌సీఎస్‌టీఐ) గుర్తింపు లభించింది. ఎన్ఎస్‌సీఎస్‌ఐటీఐ భారత ప్రభుత్వ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ) నేతృత్వంలో వుంది. ఈ విజయం ఎన్‌ఎల్‌సీకి ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని, ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందిన బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని తొలి ప్రభుత్వ రంగ సంస్థగా నిలిచిందని ఆ సంస్థ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గుర్తింపు ఎన్‌ఎల్‌సీఐఎల్ నిరంతర నిబద్ధతను ధ్రువీకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా సెంటర్ బృందాన్ని ప్రసన్నకుమార్ అభినందించారు. ఈ విజయానికి దోహదపడిన అన్ని వాటాదారులు, శిక్షకులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఊటీలో ఏసుక్రీస్తుపై పవిత్రవస్త్రం



ఊటీ చర్చిలో శ్వేతవస్త్రాన్ని భక్తిశ్రద్ధలతో చూస్తున్న క్రైస్తవులు

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఊటీలోని సెయింట్ జోసెఫ్ క్రైస్తవాలయంలో ఉంచిన ఏసుక్రీస్తు పవిత్రవస్త్రాన్ని తిలకించేందుకు భక్తులు బారులు తీరారు. ఏసుక్రీస్తు శిలువైన తర్వాత ఆయన భౌతికకాయంపై శ్వేత వస్త్రాన్ని కప్పి సమాధి చేశారు. అయితే ఏసుక్రీస్తు పునరుత్థానుడైన తర్వాత ఆ సమాధిని మూసేసిన బండరాయి తొలగి, అందులో శ్వేతవస్త్రం మాత్రమే మిగిలింది. ఏసుక్రీస్తును శిలువవేసినప్పుడు ఆయన దేహంపై ఏర్పడిన గాయాలు, కొరడా దెబ్బల గాయాలు ఈ శ్వేతవస్త్రంపై ముద్రలుగా మిగిలాయి. ఆ పవిత్ర శ్వేతవస్త్రాన్ని ఇటలీలో భద్రపరిచారు. ఆ వస్త్రం ఏసుక్రీస్తు శిలువ వేసినప్పటిదేనా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ఆ వస్త్రాన్ని ఆరు నకళ్లు తీసి పరీక్షించి చివరకు అది ఏసుక్రీస్తుపై కప్పిన వస్త్రమేనని క్రైస్తవమతాధిపతులు ప్రకటించారు. ఆ నకళ్లను ప్రపంచమంతటా ఉన్న క్రైస్తవాలయాలకు తీసుకెళ్లి కొద్ది రోజులపాటు భక్తుల సందర్శనార్థం ఉంచుతున్నారు. ఆ మేరకు ఆ ఆరు నకళ్లలో ఒకటైన పవిత్ర వస్త్రం నకలును బుధవారం ఊటీలోని సెయింట్ జోసెఫ్ చర్చిలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. ఆ పవిత్ర వస్త్రాన్ని దర్శించేందుకు క్రైస్తవులలంతా ఆ ఆలయం వద్ద బారులు తీరారు. ఆ వస్త్రాన్ని కళ్ళకు అద్దుకున్నారు. ఈ వస్త్రాన్ని గురువారం కున్నూరులోని ఆంటోనియర్ చర్చికి తీసుకెళ్లి తర్వాత కేరళ తీసుకెళ్లనున్నారు.



పేదలకు సహాయాల పంపిణీ దృశ్యం

ఘనంగా కాంగ్రెస్ నేత కుమరి అనంతన్ జన్మదిన వేడుకలు

ప్యారీస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవనంలో బుధవారం కాంగ్రెస్ సీనియర్ నేత కుమరి అనంతన్ 93వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై పార్టీశ్రేణుల సమక్షంలో కేక్ కట్‌చేసి, దివ్యాంగులకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష్‌కుమార్, మాజీ ఎంపీ రాణి సహా పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేగవంతంగా గిండి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ



గిండి రైల్వేస్టేషన్ ప్రవేశ ద్వారం నమూనా

పెరంబూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) పథకం కింద చెన్నై బీచ్-చెంగల్పట్టు సెక్షన్‌లో ప్రధాన రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పథకంలో గిండి రైల్వేస్టేషన్‌ను రూ.13.50 కోట్లతో ఆధునికీకరించనున్నారు. ప్లాట్‌ఫారం విస్తరణ, షెల్టర్ రూఫింగ్, విద్యుదీకరణ, ప్రయాణికుల బాట, పార్కింగ్ వసతి, లిఫ్ట్, అడ్వాన్స్ బుకింగ్ సెంటర్ (జీఎస్‌టీ రోడ్డు పక్కన), సీసీ టీవీ కెమెరాలు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు తదితర పనులు వేగంగా జరుగుతున్నాయి.

దావీదు సేవలు చిరస్మరణీయం
● వర్ధంతి సభలో వక్తలు



సభలో ప్రముఖులు

ప్యారీస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూళైప్రాంతానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఎండ్లూరి దావీదు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. 1920 నవంబరు 16న జన్మించిన దావీదు రంగూన్ రెజిమెంట్‌లో పనిచేసి, 2వ ప్రపంచ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. పదవీ విరమణ అనంతరం రైల్వేశాఖలో ఉద్యోగం చేశారు. ఆయనకు విజయ్‌కుమార్, ప్రభాకర్, ఆనందరావు అనే కుమారులు, కృపమ్మ, రూతమ్మ అనే కుమార్తెలున్నారు. వృద్ధాప్యం కారణంగా ఈ నెల 11న మృతిచెందిన ఎండ్లూరి దావీదు వర్ధంతి సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు వేల్పుల సాల్మన్ ఆలపించిన ఓ నాన్న పాట ఆడియో విడుదల చేశారు. సీటీబీసీ సీనియర్ పాస్టర్ రెవ.డా. ఎం.పాల్ ఈశ్వరప్ప సహా నగరంలోని పలు తెలుగు బాప్టిస్టు సంఘాల నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని దావీదు సేవలను కొనియాడారు.

రూ.2,000కే బస్ పాస్
● మంత్రి శివశంకర్

పెరంబూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నడుపుతున్న ఏసీ బస్సుల్లోనూ ప్రయాణించేలా నెలవారీ బస్ పాస్ పరిచయం చేశారు. ప్రస్తుతం అందజేస్తున్న రూ.1,000 నెలవారీ బస్‌పాస్‌తో ఏసీ బస్సులు మినహా సాధారణ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో రోజుకు ఎన్ని సార్లు అయినా ప్రయాణించవచ్చు. తాజాగా, ఏసీ బస్సుల్లోనూ ప్రయాణించేలా కొత్త బస్ పాస్ పరిచయం చేశారు. ఈ పాస్ కొనుగోలు చేసే ప్రయాణికులు సాధారణ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, ఏసీ బస్సుల్లో రోజుకు ఎన్ని సార్లు అయినా ప్రయాణించవచ్చు. మందవెల్లి బస్టాండ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రూ.2,000 బస్ పాస్‌ను రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ ప్రారంభించారు. రూ.1,000 పాస్ పొందుతున్న కౌంటర్లలో కొత్త రూ.2 వేలు బస్ పాస్ కూడా పొందవచ్చని అధికారులు తెలిపారు.



రూ.2 వేల మంత్లీ బస్‌పాస్ పరిచయం చేస్తున్న మంత్రి శివశంకర్